# దైవ మిచ్చిన భార్య

శకుంతల అంత పెద్ద అందమైందికాదు. కాని రాధాకృష్ణకిమాత్రం అనుకూలంగా నడచుకునేది. స్త్రీగా భర్తని ఎంత సంతోషపెట్టకలదో అంత సంతోషాన్నీ యిచ్చేది. అంత అతని ప్రేమకీ పాత్రురాలయింది.

శకుంతలని రాధాకృష్ణ చాలాగొప్పగా చూసుకునేవాడు. హైస్కూల్లో మేష్టరు. అతని సంసారనౌక మార్గంలో తప్పితే యితర ప్రపంచసాగరపు గాలివానలతో సంబంధంలేదు. ఏ సుడిగుండంలోనూ మునక్కుండా నడిపించాలని అతని ఆశయం, వాంఛా - అంత చిన్నది.

రాధాకృష్ణకి ఆ వూరికి కొత్తగా బదిలీ అయింది. అదే అతని జీవితపథంలో కూడా మార్పు తెచ్చింది.

***

వీళ్ళింటికి పక్కగా ఎవరో చుట్టాలు వున్నారు. చుట్టరికమేమో చాలా దూరమయిందే. వ్యక్తులుమాత్రం సన్నిహితులు! తల్లిదండ్రులూ, కూతురూను. కొంతవరకు ధనవంతులు. కూతురి పేరు పద్మావతి.

పద్మావతి రాధాకృష్ణకి వరసలు కలుపుకొంటే మరదలవుతుంది. పదహారేళ్లున్నాయి. ఆ యేడే స్కూలుఫైనలు ప్యాసయింది.

తల్లేమో చదువు మానిపించి, పెళ్లిచేసి, హాయిగా కాపురం చేసుకుంటూంటే చూడాలనుకుంది. తండ్రీ కూతుళ్ళకి పై చదువులమీద కోరిక.

పద్మావతి రాధాకృష్ణ యింటికి తరుచు రాకపోకలు సాగించేది. చుట్టరికమేగాక, చదువుకున్నదైన మూలాన్న ఆమాత్రం స్వతంత్రముంది.

పద్మావతికి వాళ్ల దాంపత్యమంటే కొంత హేయంగా తోచేది. అంత చదువుకున్నవాడు ఆమెతో కాపరమేమిటని అనుకునేది. కొంచెం చనువయ్యాక రాధాకృష్ణ చదువురాని భార్యని పెళ్ళిచేసుకున్నందుకు విచారం తెల్పుతున్నట్టు జాలిగానూ, సానుభూతిగానూ మాట్లాడేది.

ఆ మాటలు రాధాకృష్ణకి బాధగానూ, కష్టంగానూ వుండేవి. కాని పైకి ఏమీ అనలేకపోయేవాడు.

శకుంతల లేని సమయంలో, ఏ వంటదగ్గిరో వున్నప్పుడు, అంది కూడా: "అక్కయ్య ఏమంత అందమైందికాదు. చదువుకోనిది. అది నీ దురదృష్టమనుకోను" అని. కళ్లల్లోంచి గర్వం వొలికేది. రాధాకృష్ణ తల వొంచుకునేవాడు.

"వివాహాలు స్వర్గంలో జరుగుతాయి!"

"అవును. నిజమే, మరి! ఏదో వొక ఆత్మసంతృప్తి వుండొద్దూ?"

దెప్పేది; పెదివి విరిచేది.

"దాని అందంతోనూ, చదువుతోనూ పనిలేదు నాకు. చెప్పడానికి మాటలు చాలని గొప్పతనమేదో వుంది దానిలో"

"ఇది చదువు చదివినా నీలో కొంచెం పిచ్చి లేకపోలేదు సుమీ?"

ఆ సంభాషణ ఆవేళటికి అక్కడ తెగిపోయింది.

మరోసారి పద్మావతి తను చక్కని లేసులతో అల్లిన రుమాలు బహుమతివ్వాలని తెచ్చింది. ఒకమూల రంగుదారాలతో అల్లిన 'పద్మ' అనే అక్షరాలున్నాయి.

"ఇది చూశావా? అందంగా లేదూ? అక్కకి ఇట్లాంటివేమీ తెలీవు!"

అతను మాట్లాడలేదు. రుమాలు అతని భుజంమీద వేసింది.

"అచ్చు మన్మథుడిలా వున్నావే?" అటూ ఇటూ తొంగిచూసింది. అతను పరవాన్నంలో ఈగని తీసినట్టు, తీసిపారేశాడు.

ఒక్కసారిగా పద్మావతి కళ్ళల్లోకి నీళ్ళు వచ్చాయి. చప్పున, బల్లమీద వేసిన అతని చేతుల్ని పట్టుకుంది.

"వొద్దంటే, నన్ను కాల్చుకు తిన్నట్టే"

రాధాకృష్ణని కష్టపెట్టాలనుకుంది. మనసులో నొచ్చుకుని తీసుకున్నాడు, ఏమనలేక. 'ఇందులో పోయిందేమీ లేదు' అనుకుని.

***

రాత్రి శకుంతల అంది: "మీరు మారిపోతున్నారు, రోజు రోజుకీ" అని.

దెబ్బతిన్న లేడిలా అయ్యాడు. ఒక క్షణం నోట మాటరాలేదు. చివరికి అన్నాడు:

"దాని మాటేనా? బలవంతం చేసింది, తీసుకోమని"

కళ్లల్లోకి చీల్చుకుని చూసింది, సత్యాన్వేషణ కోసం. చూపుల్నెదుర్కొలేక దృష్టి కిందకి మరల్చుకున్నాడు.

"మీ తప్పేమీ లేదులెండి" చప్పరించింది, 'మగాళ్లందరూ ఇంతే' నన్నట్టు.

శరీరాన్ని ముక్కలకింద కోసినా అంత బాధపడి వుండడు, ఆ నిమిషంలో అంత బాధపడ్డాడు.

"పోనీలెండి! నేను ప్రేమకి కృతజ్ఞురాల్నిగా వుండగలితే నా కదేచాలు."

ఆత్మసంతృప్తి చెందింది.

"నాకేమన్నా నిజంగా దురుద్దేశముంటే ఈ క్షణం నిలువునా కాలిపోతాను" అంతకన్నా నమ్మకం చెప్పలేకపోయాడు.

శకుంతల దాన్ని మర్చిపోదామనుకుంది. కాని ప్రయత్నాలకి విరుద్ధంగా ఏదో బాధ లోపలి మనిషిని నమిలివెయ్యసాగింది. ఆ బాధ ప్రియుని అనాదరణకి పాత్రురాలైన స్త్రీ హృదయానికే తెలియాలి!

*05. 01. 1947–ఆనందవాణి వారపత్రిక*